

"ఇన్నాళ్ళూ మీతో ఎలా కాపురం చేశానో యిప్పటికీ అర్థం కావటం లేదు" అంది మా ఆవిడ.

"డిటో డిటో నేను కూడా" అన్నాను నవ్వుతూ.

"మీతో వాదించే బదులు నా బాధలేవో ఏ దారినపోయే దానయ్యకు చెప్పినా మనశ్శాంతి వుంటుంది" అంటూ లోపలకి వెళ్ళిపోయింది.

పావుగంట అయిన తరువాత, ఎవరో పిలిచినట్టయితే, వీధిలోకి వచ్చి, "ఎవరుకావాలి?" అని అడిగాను వచ్చినతనితో.

"దారినపోయే దానయ్యనండి. వుండమంటారా, పొమ్మంటారా? ఎంతసేపు వుండాలండీ? ఆవిడ బాధలేవో చెప్పుకుంటే విని వెళ్తానండి" అన్నాడు ఆ ఆగంతకుడు.

"అక్కరలేదు. ఓపిక చేసుకుని నేనే వింటానులే నువ్వెళ్ళు" అని వాణ్ణి పంపించి లోపలకి వచ్చాను.

జరిగిన విషయమేమిటంటే మా వివాహం రెండో వార్షికోత్సవం సందర్భంగా 5 వేలు పెట్టి "ఫ్రిజ్" కొనమంది. నేనేమో మా నాన్నగారి షష్టిపూర్తి సందర్భంగా ఆయన పేరుమీద, రెండు మూడు వేలలో గాంధీ విగ్రహమొకటి చేయించి, పంచాయతీ పార్కులో పెట్టించాలనుకున్నాను. ఎలాగూ మా ఆవిడకి అభ్యంతరం వుండదనుకుని, మాట వరసకి, పంచాయతీ వాళ్ళకు కూడా చెప్పేసాను.

మధ్యాహ్నం ఏంచేయాలో తోచక, "భార్యను లొంగతీసుకోడం ఎలా?" అనే పుస్తకం చదువుతూంటే ఎవరో పదిమంది కుర్రాళ్ళు వచ్చారు.

"ఏంకావాలి బాబూ... ఎవరు మీరు?" అన్నాను.

"మేము విశ్వవిఖ్యాత, రంగమార్తాండ రామేశ్వర్ అభిమాన సంఘ సభ్యులం. మీరు పార్కులో గాంధీగారి విగ్రహం పెట్టిస్తామని అన్నారుట కదా! ఆ వుద్దేశం మానుకుని, మా రామేశ్వర్ గారిది పెట్టించండి. రోజూ మేం ఆరాధిస్తాం. గాంధీ గారిది పెట్టితే, మనకు తెలిసినాయనేలే అని ఎవరూ ఆయనకేసి చూడరు. అయినా వూళ్ళో ఆయనకింకా నాలుగు విగ్రహాలున్నాయి కదా" అన్నాడొకడు. నాకు వేరే గత్యంతరం లేదన్నట్టు.

"అలాగే చేద్దాం" అని అప్పటికి వాళ్ళని పంపించి, "పంచాయతీ వాళ్ళకు ఏంచెప్పాలి?" అని ఆలోచిస్తూ కూర్చున్నాను. గాంధీగారి బొమ్మపెడితే, వీళ్ళు వూరుకోరని నమ్మకమొచ్చి.

మర్నాడు ఆదివారం. యింట్లో కూర్చుని "మహాభారత్" చూస్తున్నా. యింతలో తలుపు చప్పుడయితే "ఎవరా!" అని తలుపుతీసాను. చాలామంది కుర్రాళ్ళు వచ్చారు.

"ఏంకావాలి మీకు?" అన్నాను మహాభారత్ చూడ్డానికి వచ్చారేమోనని అనుమానమొచ్చి.

"మేం రామేశ్వర్ అభిమాన సంఘ సభ్యులమండి. మీరు రామేశ్వర్ గారి విగ్రహం పెట్టిస్తున్నారని తెలిసి, ఒక సలహా యిద్దామని వచ్చామండి. ఆయనకి కృష్ణదేవరాయలు గెటప్‌కంటే మాయలఫకీర్ గెటప్‌లో చాలా బాగుంటారు. అలా చేయించండి. వీరలెవెల్‌లో వుంటుంది. లేదా కోరి కష్టాలు తెచ్చుకోకండి" అని చెప్పి వెళ్ళిపోయారు.

"మహాభారత్" చూస్తుంటే ఎవరేనా డిస్టర్బ్‌చేస్తే, నాకు మహా చిరాకు. యుద్ధం మొదలయింది. రథాలు ఎదురెదురుగా వచ్చాయి.

మళ్ళీ, గుమ్మందగ్గర, ఎవరో వచ్చి బెల్లుకొట్టారు. "ఎవరయ్యా మీరు? పనీపాటా లేదా?" అంటూ విసుక్కుంటూ తలుపుతీసాను. మళ్ళీ యింకో పదిమంది కుర్రాళ్ళు.

"మేం రామేశ్వర్ అభిమాన సంఘ సభ్యులం. యిందాక మా సంఘం పేరున ఎవరో వచ్చినట్లు తెలిసింది. వాళ్ళు చెప్పినట్లు కాకుండా మీరు ఎలా అనుకుంటున్నారో అలాగే చేయించండి. మా సహకారం మీకెప్పుడూ వుంటుంది. కాదని ఎవరేనా అంటే పుచ్చెలెగిరిపోతాయి అని అన్నాడొకతను. బహుశ లీడరనుకుంటా. "ఎవరిపుచ్చెలు?" అని ఆలోచించే లోపులో, యింతకీ మేం వచ్చిన విశేషమేమిటంటే, ఆ రోజు ఘనంగా లడ్డూలు పంచిపెట్టాలనుకుంటున్నాము. ముందుగా మీచేత్తో 100 రూ.లు. బోణీ చేయండి." అంటూ భిక్షాపాత్ర... సారీ చందా డబ్బా ముందుపెట్టాడు, "యీ యకపోతే, ఆ విగ్రహం బదులు, నిన్నే నిలబెట్టేస్తాము" అన్నట్లు చూస్తూ. వేరే మార్గంలేక, వంద రూపాయలు "రామేశ్వరార్పణం" అని యిచ్చి, "బజ్జట్టు వందరూపాయలు పెరిగింది" అనుకున్నాను.

పులివూద పుట్రలాగా మా వివాహద్వైవార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, మా రంగాచారి 'ఆరడుగుల' ఎత్తుగల కృష్ణ విగ్రహాన్ని బహూకరించాడు.

మా పెళ్ళి వార్షికోత్సవ సందర్భంగా యిచ్చింది యింట్లోనే వుంచాలి అంటే కష్టం. మరి ఆరడుగుల ఎత్తుకదండీ! యింతలో మంచి ఆలోచన వచ్చింది. మా యింటి ముందున్న ఫౌంటెన్‌ని బాగుచేయించి, అందులో యీ విగ్రహం ప్రతిష్ఠించాలని, ఎటొచ్చి, అందరూ చేసినట్లు కాకుండా ఒక తామరపూవు భూమికి మూడడుగుల ఎత్తులా వచ్చేలాగా పొడుగాటి వూచని (తామర తూడులాగా) బిగించి, దానిమీద విగ్రహం పెడితే, జనాన్ని బాగా ఆకర్షిస్తుందని" అనుకుని అదే విషయం మా ఆవిడకి చెప్పాను.

"మీకేమయినా మతిపోయిందా! . ఎందుకొచ్చిన దుబారా ఖర్చండి? అయినా మనం 'ఫ్రిజ్' కొనుక్కోవా లనుకుంటున్నాం కదా!" అంది.

"నేనేమీ అనుకోలేదు. యిది నా యిష్టం. నా స్నేహితుడిచ్చిన అపూర్వకానుక. యింట్లో దాచకుండా పబ్లిక్‌గా పెడతాను. అయినా, నిన్ను మీ యింటినుంచి డబ్బుతెమ్మనలేదు గదా. నేను సిగరెట్లు, సినిమాలు, హోటల్ ఖర్చుతగ్గించి ఆదాచేసినదంతా, దీనికే

# విగ్రహప్రతిష్ఠ

**- భావరాజు వెంకట మల్లిఖార్జునం**

నాడతాను అన్నాను... యిక అప్పీలు లేదు అన్నట్టు.

"ఏంచేస్తారో చేస్కోండి. నా మాట మీరెప్పుడు విన్నారు కనుక. పోనీ! ఎక్కడ పెడదామనుకుంటు న్నారో అదైనా చెబుతారా."

"యింకెక్కడా? యిక్కడే యీ యింట్లోనే!"

"ఏవిటి? ఊరికి దూరంగా వున్న యీ యింట్లోనా? ఎవరూ చూడరు. అయినా మీ కంపెనీ నుండి వచ్చేపోగకీ, ఆ బొమ్మకాస్తా మూరుకట్టి, తరువాత ఎవరిదో ఆనవాలు కూడా తెలియదు. హాయిగా నా మాటవిని, సెంటర్‌లో వున్న మా యింట్లో పెట్టించండి. మా వాళ్ళు జాగ్రత్తగా చూసుకుంటారు. అందరికీ కూడా కనిపిస్తుంది" అంది ఆయాసపడుతూ.

"అదేమీ వీల్లేదు. నేను అనుకున్నట్లే చేస్తాను" అన్నాను.

"అంతేలెండి. నేను చెప్పినట్లు చేస్తారని ఎప్పుడైనా అనుకున్నాను గనుకనా! ఏదో గంగలో దూకండి... పోనీ ఖర్చు ఎంతవుతుందో చెబుతారా!

"ఖర్చుకేమీ ఆలోచించకు. చాలా నాజూకీగా చవకలో చేయిస్తాను. మంచి పూసమీద తామరపూవు, దానిమీద విగ్రహం వచ్చేలాగా" అన్నాను.

"అదేం పనండి" శుభ్రంగా ప్లాట్‌ఫారమ్, కట్టి, దానిమీద పెట్టొచ్చుకదా!"

"మంచిదే కాని ఫౌంటెన్ అందం పోతుంది. యిలాచేస్తే అందంగాను... కొత్తగాకూడా వుంటుంది."

"బాగానేవుంది సంబడం. పోనీలెండి. చేయించే దేదో బాగాచేయించమండి. మన యిల్లుకట్టిన మస్తాన్‌కి అప్పచెప్పండి. బాగాచేస్తాడు అంది."

"అలాగేలే కాని నేను స్వంతంగా, దగ్గరుండి చేయించాలనుకుంటున్నాను కదా! అందుకని అతని క్రింద అసిస్టెంటులున్నారులే వాళ్ళని తీసుకుని చేయిస్తా... చవకలో కూడా అయిపోతుంది" అన్నాడు అప్పటికే సగం తయారయినట్టు వూహిస్తూ.

పని తొందరగా మొదలెడదామనే సదుద్దేశంతో మస్తాన్‌కి కబురుపెట్టి ఎవరినైనా మేస్త్రిని పంపించ మన్నాను.

రెండురోజుల తరువాత ఎవరో వచ్చారంటే లోపలకు రమ్మన్నాను. వచ్చినతను, ఎంచక్కా ట్రిమ్‌గా తయారయి, టీషర్టు, నేరో పేంటు వేసుకుని "గుడ్ మార్నింగ్ సార్" అన్నాడు. ఎవరో ఆఫీసు పనిమీద వచ్చాడనుకుని "కూర్చోండి ఏంకావాలి?" అన్నాను.

"మస్తాన్ పంపించారండి. గీడేదో పనుందిటకదా!" అన్నాడు.

"నాకు మేస్త్రీ కావాలయ్యా! గుమాస్తా కాదు."

అవును "నేనేనండి మేస్త్రిని. అమెరికాలో ఏదో ఆలయంకి ప్రహరీ కట్టడానికి మేస్త్రీలు కావాలంటే దరఖాస్తు వేశాను. రమ్మంటే వెంటనే బయల్దేరి వెళ్ళాలి. అందుకే, యిలా ఎప్పుడూ రెడీగా వుంటాను. మీ పనేమిటో జరూర్‌గా చెప్పండి. వెంటనే అమెరికా వెళ్ళిపోవాలి" అన్నాడు.

"అమెరికా అంటావు వెళ్ళిపోవాలి అంటావు. అదేమైనా పక్కనున్న అమెరికన్ హాస్పిటల్ అనుకు న్నావా? దరఖాస్తు ఒక్కటే వేసావు కదా! యింకా సెలక్టవ్వాలి. వీసారావాలి. చాలా తతంగం వుందకదా!" అన్నాను.

"అయన్నీ, మాతో, ఆ మధ్యన యిల్లుకట్టించుకున్న రామకృష్ణ గారు చూసుకుంటానన్నారండి. ఆయన కూడా అక్కడికి పూజారిగా ఎల్లడానికి దరఖాస్తు పెట్టారు."

ఆయన పనితోపాటు నా పని కూడా చేసిపెతానన్నా రండి అన్నాడు. "ఏమిటీ ఆలస్యం?" అనేలా చిరాకుగా మొహంపెట్టి.

"సరే! ఏదో అఘోరించు" అని లోపల అనుకుని, అతనికి విషయం చెప్పాను.

"ఓస్ యింతేనాండి. కృష్ణాష్టమి, వారం రోజులుండ నగా పని పూర్తిచేసేస్తాను. యింకా రెన్నెల్లు టైం వుందకదా! అరన్జమెంట్లు సేసుకోవాలి. వెయ్యిరూపా యలు అడ్వాన్సు కొట్టించండి. నేనిచ్చే లిస్టుప్రకారం సరుకు వెంటనే తెప్పించండి" అంటూ ఒక లిస్టు యిచ్చాడు.

"కావాల్సిందాని కంటే ఎక్కువే రాసాడేమో" నని అనుమానమొచ్చి అదే అడిగాను.

"రాసేనేమోలెండి... అయినా తెప్పించండి. ఏమైనా మిగిలితే, మీకు నష్టం రాకుండా... సగం రేటుకి కొనేస్తాలెండి" అని నేను "ఎలా?" అని అడిగేలోపులో వెళ్ళిపోయాడు.

తొందరగా పనిమొదలెట్టాలని, సరకులన్నీ లిస్టులో రాసిన ప్రకారం సిద్ధంచేసాను. కానీ అసలు శాల్తీ మాత్రం గల్లంతయింది. అదేనండీ మా మేస్త్రీ కొంపతీసి వెయ్యిరూపాయలు తీసుకుని అమెరికా వెళ్ళలేదుకదా!" అనుకుని, ఎందుకైనా మంచిదని మస్తాన్‌కి కబురు పెట్టాను.

యింక 15 రోజుల్లో కృష్ణాష్టమి వుందనగా, మేస్త్రీ దిగి, "అయిన నెలా పదిహేనురోజుల ఆలస్యం నా వల్లే అయినట్టు. చిరాకు పడుతూ పనిమొదలెట్టాడు.

14 రోజులు గడిచాయి. ఫౌంటెన్ రిపేర్ అయింది. తామర పూవుకూడా తయారయింది. యిప్పుడిక పూసమీద దాన్ని బిగించేస్తే దానిమీద విగ్రహం నుంచోబెట్టి మంగళస్నానం చేయించొచ్చు.

సాయంత్రం పూస బిగించి, రేపు ప్రొద్దున్నే తామరపూవు పెడదామండి. అందరూ వచ్చేకా, విగ్రహం నిలబెట్టవచ్చు అన్నాడు 'తాపీ'గా మేస్త్రి.

'అదేమిటయ్యా' కాంక్రీటులో రెండు మూడురోజు లయినా వుండి, క్యూరింగ్ అయిన తరువాత పెడితే బాగుంటుంది కదా! కావలిస్తే, ప్రోగ్రాం నాలుగు రోజుల తరువాతకి మార్చుకుంటాను" అన్నాడు.

"వద్దండి మీరు కృష్ణాష్టమి నాకు పెట్టకపోతే బాగుండదు. అయినా యిది లేటెస్ట్ టెక్నిక్కండి. నేను కూడా రేపు సాయంత్రం మద్రాస్‌కి వెళ్ళాలి" అన్నాడు.

ఆ మర్నాడు కృష్ణాష్టమి ఎంతో సంతోషంగా అందర్నీ యింటికి ఆహ్వానించాము. సరిగ్గా, మిట్టమధ్యాహ్నం, పన్నెండు గంటలకి, విగ్రహం తామరపూవు మీదపెట్టి, అందరూ చప్పట్లు కొడుతూండగా, వెనక్కి వచ్చాను. "చాలాబావుంది" అని అందరూ పొగుడుతూంటే, ఎంతో గర్వంగా ఫీలవుతూ యీ టెక్నిక్, మా పక్కింటి యింజనీరు సీతారాముడికి కూడా చెప్పకూడదనుకుని అందరితో బాటు అల్పాహారానికి కూర్చున్నాను.

యింతలో ఏదో ధభీమని చప్పుడయి తరువాత హాహాకారాలు వినబడ్డాయి. ఏమిటా! అని చూస్తే విగ్రహం నీళ్ళలో పడిపోయింది.

అందరం అక్కడకు చేరాం. సందట్లో సడేమియా అని, యీ మేస్త్రి ఎక్కడికో జారుకున్నాడు.

లోపలకి దిగాలంటే కనీసం ఆరడుగుల లోతుంది. పదినిముషాల్లో, యీతగాడెవరో వచ్చి, తాడొకటి లోపలకి వేసి తాను దిగుతూ "తాడు వూపగానే పైకి లాగండి అన్నాడు."

కాసేపయిన తరువాత తాడూపినట్టయితే అందరం పైకి లాగడం మొదలెట్టాము. అంతే! ఆరడుగుల కృష్ణ విగ్రహం... కాదు, కొనవూపిరితో వున్న మేస్త్రి వచ్చాడు. వాడికి వెంటనే ప్రథమచికిత్స చేసి హాస్పటల్‌కి పంపించేము.

యీ లోపులో మళ్ళీ ఆ యీతగాడు నూతులోకి వెళ్ళి మళ్ళీ తాడు వూపగానే మళ్ళీ పైకి లాగాము. యీసారి కృష్ణవిగ్రహం కాకుండా ఎవరిదో మనిషి విగ్రహం వచ్చింది. "యిదెప్పుడు పడిందా" అని ఆలోచిస్తే తెలిసిందేమిటంటే నీళ్ళలో "కృష్ణుడు" అనుకున్న విగ్రహం పడగానే అది నాని, పైనున్న మట్టీ వగైరా పోయి అసలు రూపం వచ్చింది.

జరిగిందేమిటంటే, మా రంగాచారికి యింట్లో యిరుగ్గా వుంటే సామానుగది ఖాళీచేయిస్తే, వాళ్ళ తాతగారి విగ్రహం కుచ్చు తలపాగాతో వుండి కృష్ణవిగ్రహంలా కనబడింది. బయటపెడితే పాడయిపో తుందని, పైపైన బాగా తుడిచేసి, మాకు బహుమతిగా కృష్ణవిగ్రహం అని యిచ్చాడు. అంటే మా ఆవిడ చేద్దామనుకున్న పని, మా రంగాచారి చేసాడు వీడి "అసాధ్యం కూలా!" అని నిట్టూర్చి.

మేస్త్రీ పరిస్థితి ఎలావుందో చూద్దామని హాస్పటల్‌కి వెళ్ళి, తిరిగివస్తూ, దారిలో ఒక పత్రికాఫీసుకి వెళ్ళి "కారణాంతరాల వల్ల, ఎలాంటి విగ్రహం పంచాయతీ వాళ్ళకు ప్రస్తుతం ఇవ్వటం లేదు" అని ప్రకటన ఒకటి యిచ్చాను.